## కళాభారతికి పూర్వవైభవం తీసుకువస్తాం: మేయర్



పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 2: జిల్లాలోని కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరంలోని కళాభారతికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఆ దిశగా నగరపాలక సంస్థ ఇప్పటికే పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో సాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాభారతి ఆధునీకరణ పనులకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించిన కలెక్టర్ పమేలా సత్పతికి ప్రజలు, కళాకారుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కళాభారతి ఆధునీకరణ పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే వాటిని పూర్తి చేసి ఈ నెలలోనే కళాభారతిని పునర్ ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ రొడ్డ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## మా ఊరి మహాలక్ష్మి ట్రస్టు సేవలు అభినందనీయం



కొండాయపల్లిలో చిన్నారుల తల్లిదండ్రులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, డిసెంబర్ 2: కొండాయపల్లి గ్రామంలో మా ఊరి మహాలక్ష్మి ట్రస్టు చేపడుతున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం కొండాయపల్లి గ్రామంలో మా ఊరి మహాలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2023లో గ్రామంలో జన్మించిన ఐదుగురు చిన్నారులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5,116, తల్లిదండ్రుల సహకారంతో రూ.5 వేలు మొత్తం రూ.10,116 ను సుకన్య సమృద్ధి యోజన పథకంలో పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే, గ్రామానికి చెందిన తుమ్మల హరేందర్ అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కూతుర్లు శ్రీనిజ, శ్రీనిధి పేరున ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10.116 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, ఎమ్మెల్యే సత్యం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరున, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తున్న మా ఊరి మహాలక్ష్మి ట్రస్ట్ ఫౌండర్ రేండ్ల శ్రీనివాస్, పద్మను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు సత్తు కనకయ్య, ఆముదాల రమణారెడ్డి, అట్ల రాజిరెడ్డి, దుబ్బాజి బుచ్చయ్య, సాగి అజయ్‌రావు, భైరిశెట్టి సంపత్, బూరుగు గంగన్న, రుద్ర మల్లేశం, గంగాధర సుదర్శన్, రేండ్ల రాజిరెడ్డి, మ్యాక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై బీజేపీ ఆందోళన

విద్యానగర్, డిసెంబర్ 2 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. ఆయా నియోజకవర్గాల్లో ఈ సందర్భంగా భారీ వాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతామని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచి పెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేశ్, కొట్టె మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు, డీఏలు మంజూరు చేయాలి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2 : ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను సత్వరం మంజూరు చేసి వారి ఖాతాలకు జమ చేయాలని ఎస్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల పర్వత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంకమ్మతోటలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ బిల్లులు, మెడికల్ బిల్లులకు సంబంధించి లక్షలాది రూపాయలు ఈ కుబేర్‌లో నిలిచిపోయాయని, వాటిని సత్వరం మంజూరు చేయాలని కోరారు. అలాగే, మిగిలిపోయిన నాలుగు డీఏ లను వెంటనే మంజూరు చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు పిన్నింటి తిరుపతిరావు, శనిగెరపు రవి, సాన కిషన్, కందుకూరి దయానంద్, దాసరి శ్రీధర్, వెలిచాల వెంకటస్వామి, కొట్టె లక్ష్మణరావు, సీనియర్ నాయకులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.


## ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తున్న రేవంత్‌రెడ్డి

వీణవంక, డిసెంబర్ 2: మాలల ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల ఇన్‌చార్జి అంబాల మధునయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ సంఘాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎమ్మెస్పీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సిద్దెంకి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కోరుకంటి రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధిగా దాసారపు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా అంబాల నవీన్, ప్రధానకార్యదర్శిగా ఊట్ల అశోక్, కార్యదర్శిగా అంబాల కిరణ్, సంయుక్తకార్యదర్శిగా అంబాల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అనిల్ మాదిగ వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కండె మహేందర్, నాయకులు వెల్పుల కుమార్, సంపత్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలపై ముసుగులు తొలగించాలని వినతి

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నెలకొల్పిన మహనీయుల విగ్రహాలపై ముసుగులు తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి నివేదించాలని తిమ్మాపూర్ జేఏసీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విగ్రహాలపై ముసుగులు తీయకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు మాతంగి శంకర్, దుండ్ర రాజయ్య, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, జేఏసీ సభ్యులు పార్నంది జలపతి, కొయడ మురళి, బోయిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతు రాంచంద్రారెడ్డికి జాతీయ పురస్కారం



ఢిల్లీలో మిలియనీర్ ఫార్మర్ అవార్డు అందుకుంటున్న రాంచంద్రారెడ్డి

రామడుగు, డిసెంబర్ 2 : లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు ద్యావ రాంచంద్రారెడ్డి సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో మిలియనీర్ ఫార్మర్ పురస్కారాన్ని అందుకున్నారు. రాంచంద్రారెడ్డి కొన్నేండ్లుగా తన పొలంలో తీపిదోస, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ పంటలతో పాటు లిచ్చి, తదితర కొత్తరకం పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో గతంలో ఓసారి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తాజాగా, సోమవారం ఢిల్లీలోని పూసాలో నిర్వహిస్తున్న కిసాన్ మేళాలో జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, జాతీయ వ్యవసాయ మాసపత్రిక కృషి జాగరణ్ సంయుక్త ఆధ్వర్యంలో రాంచంద్రారెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు ప్రదానం చేశారు.

# బీఆర్ఎస్వీ ‘గురుకుల బాట’



హుజూరాబాద్ టౌన్: గోడకు అంటించిన హెల్ప్‌లైన్ నంబర్‌ను చూపుతున్న బీఆర్ఎస్వీ నాయకుడు

- విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలన
- ఏవైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని నాయకుల సూచన

కార్పొరేషన్, డిసెంబర్ 2: గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ గురుకుల పాఠశాలలను బీఆర్ఎస్వీ నాయకులు పరిశీలించారు. ఆయా చోట్ల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. రేకుర్తిలోని మైనార్టీ, ఎలగందుల కేజీబీవీ, మోడల్ స్కూల్, కరీంనగర్‌లోని మైనార్టీ, గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల, లక్ష్మీపూర్, ఇరుకుల్లలోని మైనార్టీ, రేకుర్తిలో అంధులు, వికలాంగుల పాఠశాల, నగరంలోని బీసీ సంక్షేమ హాస్టల్ 2, 3ల్లో పర్యటించి వాటిలోని పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని సుమారు 10 గురుకులాలను సందర్శించామని తెలిపారు. వాటిల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నామని, ఈ వివరాలను నివేదిక రూపంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కమిటీకి అందజేస్తామని పేర్కొన్నారు. వీటన్నింటినీ కలిపి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి బీఆర్ఎస్ నివేదించబోతున్నదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, బీఆర్ఎస్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు మొగిలి గణేశ్, ఏదుల జితేందర్, శనిగరపు సతీశ్, గుర్రం మహేందర్, సోహెల్, పరశురాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం, డిసెంబర్ 2: గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్వీ నాయకులు మండల కేంద్రంలోని కేజీబీవీ సందర్శనకు రాగా, ఎస్‌వో మాధవి అనుమతి నిరాకరించారు. దీంతో నాయకులు ఎస్‌వోతో వాగ్వాదానికి దిగారు. అయినా ఆమె లోనికి అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ఆవాల హరిబాబు విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, అందుకే తమను అనుమతించలేదని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాము ఆందోళన కార్యక్రమాల బాట పట్టక తప్పదని హెచ్చరించారు. ఇక్కడ బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు కుమార్, రాజు, మహేశ్, హరీశ్, అరవింద్, తదితరులు ఉన్నారు.



శంకరపట్నం: కేజీబీవీ ఎస్‌వో మాధవితో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

జమ్మికుంట, డిసెంబర్ 2: పట్టణంలోని వసతి గృహాలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ 8522044336 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమ్మగోని హరీశ్ యాదవ్, పాతకాల అజయ్, గురుకుంట్ల ప్రవీణ్, ఎండీ రెహమాన్, అఖిల్, 8వ వార్డు కౌన్సిలర్ పొనగంటి శ్రీలత, శిరీష, వార్డు అధ్యక్షుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 2: గురుకుల బాటలో భాగంగా పట్టణంలోని వివిధ గురుకులాలను బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆహారం బాగున్నప్పటికీ పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నట్లు గమనించామని వారు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్వీ నాయకుడు అనురాగ్, తదితరులు ఉన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఆర్జేడీ

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 2: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలను సోమవారం వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కే సత్యనారాయణ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలలో జరుగుతున్న అదనపు తరగతులను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## ‘ఏబూసి’ మృతి

జమ్మికుంట, డిసెంబర్ 2: జమ్మికుంట మాజీ ఎంపీపీ, విద్యోదయ సంస్థల చైర్మన్ ఏబూసి రామస్వామి సోమవారం మృతిచెందారు. జమ్మికుంట మండల ప్రజలకు ఎంపీపీగా, విద్యోదయ సంస్థల అధినేతగా విద్యార్థులకు ఎన్నో సేవలు అందించిన ఏబూసి రామస్వామి మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అంత్యక్రియల చార్జీల పెంపునకు ఉత్తర్వులు

కలెక్టరేట్, డిసెంబర్ 2: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరణిస్తే ప్రభుత్వం ఇస్తున్న అంత్యక్రియల ఖర్చులను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జీ.ఓ.ఎమ్మెస్. నంబర్.247 ద్వారా సోమవారం ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

వీణవంక, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఫిజికల్ సైన్స్ బోధించడానికి గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి సునీత ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని, జీతం రూ.18 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు రెండు రోజుల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## దుబ్బ మల్లన్న ఉత్సవాలు ప్రారంభం

జమ్మికుంట, డిసెంబర్ 2: మున్సిపల్ పరిధిలోని ధర్మారం శివారులో గల శ్రీ దుబ్బ మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు దృష్టికుంభం, పెద్దపట్నం, అనంతరం స్వామివారి కల్యాణం జరుగగా, స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండపల్లి సుభద్ర, ఆలయ అర్చకుడు మేడిపల్లి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీ విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 2: బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న నిరంకుశ దాడులను నిరసిస్తూ నగరంలో ఈ నెల 4న హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఐక్యవేదిక నాయకులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ర్యాలీ కోర్టుచౌరస్తాలోని గోపీకృష్ణ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ర్యాలీలో హిందూ బంధువులు, భక్త మండళ్లు, సంఘాలు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## నిత్యావసర సరుకుల వితరణ

గంగాధర, డిసెంబర్ 2: ఆహార భద్రతలో భాగంగా గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నాచంపల్లి గ్రామంలో సోమవారం 10 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులకు మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నియోజకవర్గ కార్యదర్శి పొత్తూరి సురేశ్, ఉపాధ్యక్షుడు గజ్జెల సతీశ్, ఎంసీవో దీకొండ కళ్యాణ్, మహిళలు పాల్గొన్నారు.

## భగవద్గీత పోటీల్లో బ్లూబెల్స్ విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2 : నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో హనుమాన్‌నగర్ బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీతామనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పోటీల్లో కే వేదాన్విక, టి. హర్షిని, ఆర్ శ్రీ శాన్వి, ఈ స్నితిక ప్రథమ, ఎం శాన్విక, పి. హర్షిత్ ద్వితీయ, సీహెచ్ రిషిక్, టి. రశ్మిత తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 15న కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## పారమిత విద్యార్థుల క్షేత్ర పర్యటన

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం భువనగిరి జిల్లాలోని ఉద్యానవనాన్ని సందర్శించారని ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 5వ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు వివిధ రకాల పంటలు పండించే వ్యవసాయ క్షేత్రాల్లో కలియ తిరుగుతూ, పొలం దున్నడం, వరి నాటు వేయడం, పంట పొలాలకు నీటిని అందించే విధానాన్ని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు.

## ముగిసిన బాలల వైజ్ఞానిక ప్రదర్శన

కొత్తపల్లి, డిసెంబర్ 2 : కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 52వ బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పోటీల్లో సైన్స్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఏడుగురిని, ద్వితీయ స్థానంలో ఏడుగురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అలాగే, సీనియర్స్, జూనియర్స్ విభాగాల నుంచి తృతీయ స్థానానికి 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల అధినేత డా ఫాతిమారెడ్డి మాట్లాడారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

గన్నేరువరం, డిసెంబర్ 2: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రుణమాఫీ కానీ రైతులు చాలా మంది ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అధికారులతో విచారణ జరిపించి వెంటనే రుణమాఫీ పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి కాంతల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, మండల నాయకులు కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, నయీం, కోర్వి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిషేధాజ్ఞల కొనసాగింపు

రాంనగర్, డిసెంబర్ 2: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అలాగే డీజే సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఏయిర్ క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేధించామని తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ

కలెక్టరేట్, డిసెంబర్ 2 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 259 మంది వివిధ సమస్యలపై కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు. కాగా, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి, సమస్యల నుంచి కాపాడుతామంటూ అర్జీదారులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రజావాణి నిర్వహించారు. ఇందులో నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు అర్బన్ సీడీపీవో సబితా కుమారి తెలిపారు.


## నేడు దివ్యాంగుల ర్యాలీ

కలెక్టరేట్, డిసెంబర్ 2 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, నగరంలో మంగళవారం ఉదయం దివ్యాంగుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, ఇన్‌చార్జి సంక్షేమ అధికారి సబితా కుమారి తెలిపారు. ఉదయం 9 గంటలకు పురాతన పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగే ర్యాలీకి పెద్ద ఎత్తున దివ్యాంగులు హాజరు కావాలని కోరారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 2: నగరంలోని 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పద్మనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, సాయిబాబా టెంపుల్ ఏరియా, విజేత అపార్ట్ మెంట్, మార్కండేయ నగర్, ప్రగతి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## టీఎంటీయూ జిల్లా అధ్యక్షుడిగా తిప్పని శ్రీనివాస్



తిప్పని శ్రీనివాస్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2 : తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్ యూనియన్ (టీఎంటీయూ) రాష్ట్ర కార్యవర్గం సమక్షంలో జిల్లా కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా తిప్పని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర బాధ్యులు రాజు జాదవ్, బాబు, సందీప్, జిల్లా బాధ్యులు మధుకర్, ముక్తి ప్రసాద్, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నూతన కమిటీకి ఎన్నికలు

తెలంగాణచౌక్, డిసెంబర్ 2: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికలను ఈనెల 13న నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు గజ్జల ఆనందరావు, సుద్దాల లక్ష్మణ్, ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జల కాంతం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, జిల్లా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## బీఆర్ఎస్‌లో చేరిక



లండన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయికిరణ్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 2 : కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్‌రావు, తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన నర్సింగరావు, పవన్ కళ్యాణ్, భరత్‌రావు, హర్షవర్ధన్‌రెడ్డి, సంజయ్‌రెడ్డి, నందీప్ దొగ్గల, తదితర ఎన్ఆర్ఐలు సోమవారం లండన్‌లో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయికిరణ్‌రావు మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేసి కాంగ్రెస్‌కు రాజీనామా చేశానని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశానని, కానీ తెలంగాణలో ఏడాదికాలంగా జరిగిన విధ్వంసం చూసి చాలా బాధపడుతున్నానని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడి కేసీఆర్, కేటీఆర్ తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారని, వారి నాయకత్వం ఉంటేనే తెలంగాణకు మేలు జరుగుతుందన్నారు. అందుకే బీఆర్ఎస్‌లో చేరుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త జయపాల్‌రెడ్డికి సన్మానం



జయపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్ బాలాగౌడ్

గంగాధర, డిసెంబర్ 2: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి విదేశీయాత్రను ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా పార్టీ కార్యకర్తలు, మిత్రమండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం గంగాధర సింగిల్ విండో కార్యాలయంలో సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ జయపాల్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మడ్లపెల్లి గంగాధర, వేముల దామోదర్, రామిడి సురేందర్, మిత్రమండలి సభ్యులు మడ్లపెల్లి రమేశ్, తాళ్ల శ్రీనివాస్, పొన్నం పరశురాములు, మల్యాల వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

గంగాధర, డిసెంబర్ 2: మంగపేట గ్రామానికి చెందిన దోర్నాల మహేందర్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందగా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

## శ్రీపతి రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

చిగురుమామిడి, నవంబర్ 2 : బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు కూతురు శ్రీపతి రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. సోమవారం నవాబ్ పేట గ్రామంలో శ్రీపతి రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కరివేద మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు మక్బూల్ పాషా, బీసీ సెల్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ మండలాధ్యక్షుడు కృష్ణమాచారి, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు బోయిని మనోజ్, గ్రామాధ్యక్షుడు పిల్లి వేణు, నాయకులు కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, కాంటారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

## కలెక్టరేట్‌లో టెస్కో ప్రదర్శనశాల ఏర్పాటు

కలెక్టరేట్, డిసెంబర్ 2 : రాష్ట్ర హ్యాండ్లూం వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టెస్కో) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. ఈనెల 9 వరకు ప్రదర్శన కొనసాగుతుందని, స్టాల్‌లో ప్రదర్శించే వస్త్రాలు కొనుగోలు చేసేవారికి ప్రత్యేక డిస్కౌంట్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చే జిల్లా వాసులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు.

## ఆరు గ్యారెంటీల అమలు కోసం ఉద్యమిస్తాం

తెలంగాణచౌక్, డిసెంబర్ 2: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజల ఇచ్చిన ఆరుగ్యారెంటీల అమలు కోసం ఉద్యమాలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందాలాల్ మిశ్రా భవనంలో సోమవారం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, వర్ణ వెంకటరెడ్డి, బీమాసాహెబ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరుగ్యారెంటీల్లో ఉచిత ప్రయాణం తప్ప మిగతా హామీలు అమలు కావడం లేదన్నారు. ఇటీవల రెండు రోజులుగా జరిగిన పార్టీ మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 20 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. వాటి అమలు కోసం ప్రజా సంఘాలు ప్రజాతంత్ర వాదులతో కలిసి పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా కన్వీనర్ నాగమణి, నాయకులు సంపత్, అరవింద్ పాల్గొన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

రామడుగు, డిసెంబర్ 2: వెలిచాల గ్రామంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో గ్రామానికి చెందిన బండపల్లి శ్రీధర్ ఫిర్యాదు చేశారు. 2007-08వ సంవత్సరంలో ఇందిరమ్మ గ్రామీణ శాశ్వత గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన కొందరు లబ్ధిదారులు ఎలాంటి నిర్మాణాలు చేసుకోలేదని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న గ్రామానికి చెందిన కొంతమంది నాయకుల ప్రోద్బలంతో పదహారు సంవత్సరాల తర్వాత నిబంధనలకు విరుద్ధంగా స్థలాలను ఇతరులకు అమ్ముకొంటున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన వారు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇళ్ల నిర్మాణాలు చేసి, గ్రామపంచాయతీ నుంచి ఇంటి నంబర్లు పొందే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## 4న జిల్లాస్థాయి సీనియర్స్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 2 : ఈనెల 4న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనిస్ పాషా తెలిపారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు 9866834675 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు గట్టుదుద్దెనపల్లి విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పీఈటీ

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 2: కామారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సెపక్ తక్రా బాలికల విభాగం (అండర్ -14) పోటీల్లో గట్టుదుద్దెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సింగసాని అశ్విత ప్రతిభ చూపి, తృతీయ స్థానంలో నిలిచిందని పీఈటీ సుమన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. సోమవారం విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇంద్రసేనా రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, పీఈటీ, విద్యార్థులు అభినందించారు.